"చెరువు ఊరుకు ఆదెరువు. చెరువు సబ్బండ వర్ణాలకు ఆధారం. చెరువు సంస్కృతికి, జీవన విధానానికి చిరునామా. ముఖ్యంగా సముద్రం లేని తెలంగాణలో చెరువే ఒక సముద్రంగా భావిస్తారు. కారణాలేవైనా చెరువులు విధ్వంసానికి, నిరాదరణకు గురైనవి. ఇప్పుడు అది ఒక జ్ఞాపకంగా మిగిలే ప్రమాదం దాపురించింది. ఆ వేదనే ఈ కథ."

గుడిపల్లి నిరంజన్

# 3 నీరెటుకాడి కల





ఏం బత్కసి యిది. ఇగురందప్పిన బత్కని మా నాగ పెద్దయ్య తనను తానే నిందించుకుంటూ తిట్టుకుంటున్నడు. బత్కుతున్న తీరు దరువు తప్పిందని ఒక్కటే బాధ. మా పెద్దయ్యకు ఎంతలేదన్న ఎనభై ఏండ్లుంటయి. ఊర్ల బత్కుతున్న జనాలలో మా పెద్దయ్యనే వయసు లో పెద్దోడు. ఎన్కటి బత్కులను ఇప్పటి బత్కులను ప్రత్యక్షంగా సూసినోడు. ఎనభై ఏండ్ల కిందటి సిన్ననాటి గ్నాపకాలను తల్సుకొని తల్సుకొని బాధ వడుతుండు. తను సిన్నప్పుడు సేసిన సిలిపి పనులను తల్సుకుంటుండు. ఊరి బత్కులను, వృత్తులను మౌనంగా ఒక్కొక్కటి హృదయానికి హత్తుకొన్న సంఘటనలను గ్నాపకం చేసుకుంటుండు.

మా పెద్దయ్యకు ఊహ తెలిసినప్పటి నుంచి వాళ్ల తాత, వాళ్ల నాయిన సెరువుపై ఆధారపడి బత్కినోళ్లు. ఊర్లో పెద్దగా జాగలు, పొలాలు లేనోళ్లు. సెరువు నిండితేనే బత్కెటోళ్లు. సెరువు మట్టి పొత్తిళ్ల పైన సేదదీరినోళ్లు. మా పెద్దయ్య కుటుంబమే కాదు, ఊరు ఊరే సెరువు ఎదపైన నిలబడి బత్కెటోళ్లు. ఈ కులం, ఆ కులం అని కాదు అన్ని కులాల సబ్బండ వర్ణాలు సాకలి, మంగళి, మాల, మాదిగ, గొల్ల, కురువ, ముష్టి, బోయ, ఎరుకలి, కాపులు మొత్తం సెరువును ఆధారంగా సేసుకొని బత్కినోళ్లు.

మా ఊర్లో సెరువు నిండితే, సెరువెనుక పొలాలకు నీరు కట్టనీకె ఒక నీరెటుకాడు ఉంటుండె. ఆ నీరెటుకాని వృత్తి తరాల నుండి మా పెద్దయ్యోళ్లకే వస్తుంది. మా పెద్దయ్య వాళ్ల తాత, వాళ్ల నాన్న చివరకు మా పెద్దయ్య గూడ నీరెటుకాని గానే బత్కుతుండ్రు. ఎన్నడు కూడా కరువు ఎరుగరు. ఇంట్ల తిండి గింజలకు కొదువ లేకుండె. తన ఐదుమంది పిల్లలు మా సాయి పెద్ది, మా పెద్దయ్య అందరూ సుఖంగ ఉంటుండ్రి. అట్ల మా పెద్దయ్యకు ముప్పై ఏండ్లొచ్చిందాక నీరెటుకాడిగానే సంతోషంగా బత్కిండ్రు.

✤

రాన్రాను దినాలు మారుతుండె. పాలకులు మారుతుండ్రి. సెరువుల రూపం మారుతుండె. సెరువుపై ఆధారపడి బత్కె కులాల బతుకులు నీరుగారిపోవట్టె. పాలకుల నిర్లక్ష్యం వల్ల సెరువులు ఎండుతుండె. కాల్వలల్ల కంపలు మొల్సె. సెరువు కట్ట సన్నవడ్డది.

పూడిక పేర్కపాయె. సెర్ల నీరు నిల్వకపాయె. నీరంతా పెద్దవాగుల వడి కృష్ణానదులకు పోతుండె. సిన్ననీటి పారుదల రంగం సచ్చిపాయె. సెరువు దిక్కు సూసేటోడు లేకుండాయె. సెరువెనుక కాపుదనం లేకుండయ్యింది. సెరువు మళ్లల్ల వయ్యారి భామ మొలిసింది. సెరువుల తుమ్మలు లేచినయి.

సెరువెండినట్లే పచ్చగున్న మా నాగ పెద్దయ్య కుటుంబం ఎండుతుండె. కరువు కుటుంబం నిండా పరుసుకుంది. ఇంగో మాట సెప్పాలంటె ఊర్ల అన్ని వృత్తులు, అన్ని కులాలు సెరువు ఎండినందుకు ఈసోరుమని బత్కులీడుస్తున్నై. సేసేది ఏమి లేక మంది మొత్తం ఎక్కడ పని దొర్కితే అక్కడికి వొలుస వోతుండ్రి. సగంబడ ఊరంతా ఖాళీగయ్యింది. ఒగనాడు ఊరికి సరిపడా ఒడ్లు, బియ్యం పండించినోళ్లు, ఇయ్యాల్ల కంట్రోలు బియ్యానికై ఎదురుసూస్తుండ్రు.

ఎందుకు ఊరు ఇట్లాయె అని ఒకటే ఫికరు జేస్తుండు నాగ పెద్దయ్య. ఏమన్న పట్టెనా ఏంది ఊరికి అని మంచుల ఒక్కటే బాధవడ్తుండు. పికరుజేసి ఫికర్జెసి సన్నగైండు.

ఆయాల్ల పొద్దుమూకినాక కడుపుల మసివొసినట్లుంటే ఓ కల్లువొటు సీస తాగిండు పెద్దయ్య. అయినా మంచు మనుసులలేదు. ఏం పన్జేయనీకవొయిన సేయబుద్ధి అయితలేదు. కొంచెం సీకటైనాక ఇంటికొయ్యిండు. కొడుకులంత వలస వొయిండ్రు. ఇద్దరు మనువలు, మనువరాండ్లు పెద్ది గల్సి ఉంటుండ్రు. ఇంటికొయ్య టాల్లకు సేతయిసేతగాక పెద్ది ఇంత అన్నమేసుకొచ్చింది. తిన్నడు. గొంగడి దీస్కొని సపారంల పడుకున్నడు.

### 1

పొద్దగ్గెర ఎన్కటి రోజులను తల్సుకోని బాధపడ్డందుకో ఏమో గాని ఆ రాత్రి పెద్దయ్యకు మంచి కలవడ్డది. కల అంటే అది మామూలు కల కాదు. తియ్యటి కల. పచ్చ పచ్చని బతుకు కల. సబ్బండ వర్ణాల బతుకు కల. ఊరుమ్మడి బతుకు కల. సెరువు అందాలను వొలక బోసిన కల. సెరువుతో లంకెబడిన ఒక్కో వృత్తి బత్కు సిత్రాలను కలగన్న కల. కండ్లముందర ఒక్కొక్క జ్ఞాపకం దృశ్యాలు దృశ్యాలుగా మెదుల్తున్నై. కండ్ల నిండా సెరువు అందాలు. నిజంగా అనుభవించిన సెరువును జీవితాన్ని కలగంటుండు.

చల్లటి గాలి సున్నితంగా వొస్తుంది. క్రమంగా గాలి ప్రవాహ వేగం పెరిగి జుయ్... జుయ్ మని సప్పుడు వొస్తుంది. పైన ఆకాశంలో నల్లని మోడం వేసుకున్నది. మేఘాలు గర్జిస్తున్నై. మెరుపులు మెరుస్తున్నై. పిడుగులు పడ్డ సప్పుడు వింటుండు. వానా గాలివాసన వింటుండు. సెవులగల్లు వడ్డట్టు ఉంది. పెళ్లలు విరిగి పడుతున్న సప్పుడు. వాన ఉత్తరదిక్కు నుండి వీస్తుంది. సూస్తున్నంగనే వొలిపొలిపి వానదీస్తుంది. అది మురగసిరా కార్తి వాన. వొచ్చుకంవొచ్చుకమే గట్టిగొచ్చింది. వొక్క ఉదుటున

కాలువలు పారినవి. కాలువలలోని నీటి ప్రవాహం రాగయుక్తంగా పాడుతూ లయ బద్ధంగా ప్రవహిస్తుంది. మృదుమధురమైన ఆ ధ్వనిని వింటూనే గాఢంగా కల గంటుండు. మనస్సు అమృత సరస్సులో తానమాడినట్టుంది. సెరువు నిండింది. నిర్లిప్తత, చికాకు, నైరాశ్యం, ఏవగింపు పెద్దయ్యలో అన్ని మాయం అయినవి. కొత్త ఉత్సాహం వచ్చినట్లనిపించింది కలలో.

సెరువు మా పెద్దయ్యకు తల్లి ఒడిలెక్కలాగ అనుకుంటడు. మా పెద్దయ్య కొక్కనికే గాదు రైతులందరికి తల్లి ఒడె. మా ఊల్లె మనుషులందరు తరాల పాటు సెరువును నమ్ముకొనే బత్కినోళ్లు.

గంటలు గంటలు నిద్రపోయేవాడు కాదు, గాని ఇయ్యాల్ల సమ్మగా నిద్రవో తుండు. నిద్రలోనే ఉల్కిపడి సెరువమ్మా! సెరువమ్మా! అని అంటుండు. కలవ రిస్తుండు. పలవరిస్తుండు. కల సాగుతూనే ఉంది. అలా కలలోనే లేచి కూర్చొని, నిద్ర మెలకువరాని స్థితిలో శూన్యంగా బెంగపడినట్టు, సెరువు పిల్సినట్టు సింత సేస్తుండు.

మా పెద్దయ్య కలతతో లేచి కూర్చున్నాడు. మూసిన కళ్లు తెరిచి పెద్దవి చేసి చూసిండు. వేగంగా సెరువువైపు నడుస్తుండు. సందికంత గుండా వూటగా నడుస్తుండు. సెరువును సూడకుండ క్షణకాలపు ఆలస్యాన్ని సహించలేకపోతుండు. దారిలో ఏం ఉన్నదీ, లేంది కనిపిస్తలేదు. కాళ్లకు ముళ్లు, రాళ్లు తగిలినా పట్టించు కుంటలేడు. కళ్ల ముందర సెరువు తప్ప ఏం కనపడుతలేదు. చుట్టూ నిలాంత నిశ్శబ్దం పేరుకోని ఉంది. భయపడినట్లు గాలి కూడా కదలడం లేదు. అయినా సెరువు దగ్గరికి ఎలా వెళ్లాలో పెద్దయ్యకు బాగా తెలుసు. సెరువు దగ్గరికి పోయిండు.

సెరువంటుంది, ''నాగన్న ఓ నాగన్న, ఆగిపోయావేంది?''

మా పెద్దయ సెవులను నమ్ముతలేడు.

ఎవరబ్బా పిలిచింది అని ఎన్కముందు సూస్తుండు.

సెరువు మళ్లీ పిల్సింది.

''ఆ... నేనే నాగన్న. నీ తల్లిని. రా! బిడ్డ రా!

''ఇంత దగ్గరికొచ్చి ఆగిపోయావేంది?

''ఎన్ని దినాలు నన్ను సూడకుండా ఉంటావు?

''రా! రా! నామధ్యకు రా! నా కౌగిలిలోకి రా!'' అని ఎలుగెత్తి, సేతులెత్తి పిలుస్తుంది.

అమృత స్పర్శనిచ్చే ఆ సెరువు మట్టి పెద్దయ్య కాళ్లకు తగలగానే పాణం నిమిరినట్టైంది. ఆ సెరువు గాలిలో ఏదో ప్రాణశక్తి ఉంది. ఆ అలలో ఏదో చైతన్య శక్తి ఉంది. సిన్నగా సెరువులోకి దిగిండు. కాళ్ల నుండి సర్రున ప్రాణశక్తి పైకి పాకి మనస్సును తాకింది. జిహ్వ స్పర్శ చేసే ఆ నీరు మా పెద్దయ్యకు మహాయిష్టం.

లోపలికి దిగుతనే ఉండు. అలిసిపోయె వరకు ఈతగొట్టిండు. ఆ అలల ప్రవాహశయ్యలపై నిద్రపోతుండు. మనిషి, మనస్సు గాలిలో తేలుతుండె. గంటల తరబడి నీళ్లల్లనే ఉన్నడు. నీళ్లను మాటిమాటికి మీన జిలకరిచ్చుకుంటున్నడు. మనస్సంత నిమ్మలంగా కుదుటవడ్డది. సెరువు తల్లి కెరటాలు కూడా చేతులు సాపి పసిపాపను ఎత్తుకున్నట్లు ఎత్తుకోని ముద్దాడుతున్నది. ఇది సూసి ఆకాశంలోని నక్షత్రాలు అలా తదేకంగా సూస్తునే ఉన్నై.

తనివితీర అలలను హత్తుకున్నాక, సెరువుకు ఆనుకొని ఉన్న బోడబండమీద కూసున్నడు. ఊకె సెరువు దిక్కె సూస్తున్నడు. అప్పుడు సెర్ల మునుగు మునుగు బుడ్డోళ్లు లట్టుకన మునుగుతున్నై, తేలుతున్నై, శ్యాపలు గూడా సట్కున మునుగుతున్నై, తేలుతున్నై. దోంద్ర గిచ్చలు పుస్కున సెరువు నీళ్లలోకి కొర్లెస్తున్నై. ఓ దిక్కు మొగులు ఈనిన వాన నీరు జెప్పజెప్ప సెరువులోకి సేరి సేదదీరుతుంది. కయ్యకయ్య కప్పలరుస్తున్నై. లట్టుక్కున కొంగ శ్యాపలను నోట్ల కరుస్తుంది. సర్రసర్ర రాళ్ల సర్కెల్లోని నీరు కట్టెలు నీట్లకు వోతున్నై. కోలాటం పురుగులు జెర్రున నీటిపై జారుతున్నై.

## 2

ఒక అల మరో అలను ముద్దిస్తుంది. అలల సంపర్కంతో మెరుపులు పుడుతున్నై. అలల సంగీత శృతులకు ఆస్కారు అవార్డు ఇవ్వాల్సిందే అన్నంత ఇంపుగా సంగీతాన్ని పుట్టిస్తున్నై. అలల అభినయం మా పెద్దయ్య కళ్ల ముందు కదలాడుతున్నై. సెరువు అలలపైన రెక్కలు వాల్చిన కొంగలు సెంద్రుని ప్రతిబింబాలైనవి. గాల్లో సీతాకోక సిలుకలు ఎగురుతూ నీటి పెదవులపై మకరందాన్ని జుర్రున జుర్రుతున్నై. నాసుల్లో సేప ఈదుతున్న తుల్లింతరాలైంది. సెరువు, మట్టి పొత్తిళ్లపైన మౌనంగా సేద తీరుతుంది.

ఎదలకానిన అలలను ఎగపోస్తు తీతువు పిట్టల కాళ్లు సెరువు గర్భాన్ని తంతు ముందుకు ఈదుతున్నై. నీట మునిగిన లొట్టపీసు పొదల ఎదలపై ఎక్కి దోంద్రగిచ్చ అరుస్తుంది. పుల్జరి పొందల సందులో నుంచి పొడ్సుకొచ్చిన ఎర్రటి పొద్దు సెరువు సేమము అడుగుతుంది. సెరువు కట్టపై గుబురు గుబురు పుల్జరి పొదల, తుమ్మసెట్ల కొనలపై గిజిగాడి కలల శ్వేతసౌదం నీటి అలలపై ప్రతిబింబమై ఊగుతుంది. లొట్టపీసు పూల సొగసు కమలాలను కాలదన్నుతున్నై. ఈతసెట్టు మీద నేత పిట్టలు అరుస్తున్నై. ఓపక్క టిక్కటిటివ, టిక్కటిటివ పిట్ట అరుపు. ఇంగోపక్క గువ్వల గొంతుల సంగీతం. కుర్రుకుర్రువంటు కొంగల అరుపులు. ఎన్నో ఎన్నెనో పక్షిజాతి అరుపులతో సెరువు జానపద సంగీత కచేరైంది.

సెరువెంత అదృష్టవంతురాలో నిత్యం సంగీతమైన మనస్సుతో నిద్రపోతుందని తల్సుకుంటుండు. వందల కొంగలు సెరువు అలల కాంతుల్లో ముత్యాలహారమై ఎగురుతున్న తీరు మా పెద్దయ్యకు కమ్మగా అనిపిస్తుంది. సెరువును ఆనుకొని

ఉన్న ఊరగుట్ట సెట్లు నీటిపాన్నుపై తలకిందులై సెరువుకు నమస్కరిస్తున్నై. వేలాదిగా తుమ్మ సెట్లకు నాగసరం కాయోలే గిజిగాడి పిట్ట గూళ్ల దృశ్యాలు సూస్తనే ఉన్నాడు.

పొద్దున్నె పొద్దు అలలకు బంగారు కాంతులను తాపుతుంది. కట్టెనుక ఎన్నో సన్నజాతి గడ్డిపొదలు వయ్యారంగా తలలూపుతున్నై. ఎన్నో తంగెడ్లు తలలకు బంగారు పుష్పాలను అలంకరించుకున్నవి. సెరువు సుట్టు కంపసెట్లు రక్షణైనవి. వేలాది నల్ల తుమ్మలకు తెల్లని వెండి ముళ్లు మెరుస్తున్నవి. సెరువు అందాల కాంతులను అలలు అలలుగా కలలు కంటూనే ఉన్నాడు.

## 3

కల క్రమంగా విస్తృతమౌతుంది. సెరువుపై ఆధారపడి కాపుదానం సేసెటోళ్ల బత్కులను కలగంటుండు. కాపుదానం జేసెటోళ్లు సెరువులోకి నీలొచ్చినెంబటే ఇత్తన పొడ్లను సుదురాయించి పొక్తగ పోతం జేసి, తాలంతా సాటల్లో సెర్గి గట్టి గట్టి వడ్లను పక్కకు దీస్తరు. మండెవెట్టి నాల్గురోజులు నానబెట్టి తెల్లని మూతులతో వరి మొల్క లొస్తే, తుకం మడిలోకి సెరువు తూం నుంచి నీళ్లొదిలి, మెత్తగా దుక్కిని దున్ని తుకం జేస్తరు. తరువాత మొల్క అల్తుంఁడ్రి. తుకం మడిలో కొంగల బెదురుకు దిష్టి కుండ పెట్టెటోళ్లు. ఎదలు పగిలిన వరిగింజలు పచ్చని పత్రహరితమై భూతల్లి నొసటిపై ఆకుపచ్చ సంతకం జేస్తున్నాయి.

పదిహేను దెసాలల్లో తుకం వొత్తుకొచ్చేది. ముదురు తూకమైతే సేను ఎచ్చదని యుద్ధం జేసినట్లు నారుమళ్లను సిద్ధం జేసెటోళ్లు కాపుదానపొల్లు. తుకం మడిలోని కమ్మని మట్టివాసనని పసిగట్టి సీతాకోకసిలుకలు సిందాటలు ఆడేటివి. నారు మళ్లు చేయడమంటే భూతల్లిని నీళ్లువోసుకోమని చెప్పడమే అని మా నాగ పెద్దయ్య అనుకుంటడు.

పెరిగిన నారు పీకి, అమ్మలక్కలు మోకాళ్ల పైకి సీరలు గట్టి వొంగి వొంగి వొరినారు నాడుతుంటే బతుకుతత్త్వం తెలిసిన తత్త్వవేత్తల్లా కనిపించేది అమ్మలక్కలు. బురద నుంచే బువ్వొస్తుందనే గొప్ప సైన్సు తెలుసు మా పెద్దయ్యకు. సెరువంటే పంట కావ్యమని, పాట కావ్యమని, సమిష్టి శ్రమ తత్త్వమని తెలుసు. శ్రమను మించిన మతముండదు, సెరువుకు మించిన పండుగ ఉండదని మా పెద్దయ్యకు బలమైన నమ్మకం.

వొంగి వొరినాట్లు నాటుతుంటే పైన కొంగలబారు ఎగురుతుంటే ఆ దృశ్యం బాపు బొమ్మల కన్న ఎక్కువ అందంగా కనిపిస్తుండె. సూస్తున్నంగానే సెరువెనుక భూమంతా పచ్చని పైరు సీరలు గట్టినవి. అది సూసి సెంద్రుని అందమంతా బోర్ల పడింది. వరిసేల వొల్లు పెరిగింది. సంసారానికి సై అన్న సుక్కోలే సేను తయారైంది. సేను కడుపుతోటి ఉంది. మా పెద్దయ్య అనేక పిల్లకాలువల ద్వారా ఊరిలోని అందరి పొలాలకు నీరు గట్టెటోడు. అందరి పొలాలను కండ్లలెక్కనే కాపాడేటోడు. నిండు

గర్భినిలా సేను సెల్కలు కనిపిస్తుండేవి. వరి సేను బాగా ఈనింది. గింజలు గట్టినైనవి. వరి కర్రల ఎన్ను నేలకు వాలితే మా ఊరి కన్నులు విచ్చుకున్నవి. కమ్మరోల్ల కొలిమిలో సరిపిచ్చిన కొడవళ్లతో కోతలు కోస్తుండ్రు. నాట్లేగాదు కోతలు ఒక కళే. కళ్లం వొక కళే అని కలగంటుండు. వ్యవసాయమంటే జీవితాన్ని ఆవిష్కరింపచేయడమేనని సంతోషపడ్తుండు.

## 4

కల సాగుతూనే ఉంది. ఎన్నడన్న కలవొస్తే మధ్యలోనే లేసి కూసునేటోడు పెద్దయ్య. ఇయ్యాల్ల లేస్తలేడు. అట్లవడి ఇట్లవడి కల సాకలి గేరికొయ్యింది. సాక లోల్లకు సెరువుకు ఎంత గాఢ అనుబంధముండెనో ఒక్కసారి కండ్ల ముందర కదిలి పోతున్నయి. సాకలోల్లు అంటే ఊరు ఊరునే రోగాల నుంచి కాపాడినోళ్లని గౌరవ భావం ఉంది పెద్దయ్యకు. ముట్టు బట్టలను, మురికి బట్టలను సెర్ల ఉత్కి బత్కులు కాపాడినోళ్లని వారిపై శాల ప్రేమ సూయించెటోడు. సౌడుమట్టి తోటి మురికి బట్టలను తెల్లగా జేసే సాకలి లింగన్నంటే మహాయిష్టం. ఎన్నో రోగాల నుంచి ప్రజలను రక్షించేది సాకలొల్లు, సెరువేనని సెప్తుంటడు. ఊరిని రక్షించే డాక్టర్లు సెరువు, సాకలోల్లేనని తల్సుకుంటుండు.

ఊరుమ్మడి బట్టలు పెద్ద పెద్ద మూటల్ల గట్టుకోని సెర్లకు దెచ్చి ముందుగాల బట్టలను ఉడికెయ్యటానికి సాకలి బట్టీలు పెట్టెటోళ్లు. తరువాత సౌడుమట్టిని తడిబట్ట లకు పట్టిచ్చి జాడిచ్చి బండమీద గొట్టి బట్టలను తెల్లగా మల్లెపూలలాగ జేసేటోళ్లని గ్నాపకం చేసుకుంటుండు. ఆ సాకిరేవు బండలు, ఆ ఉసో... ఉసోలు ఇప్పుడు ఇని పిస్తులేనందుకు తెగ బాధపడిపోతుండు.

## 5

ఊర్లె ఉన్న బర్రెలు, గొర్రెలు, ఆవులు, సమస్త జీవరాశికి సెరువు అండ వున్న తీరు ఒక్కసారిగా కండ్ల పొరల మీద కూకున్నవి పెద్దయ్యకు. సిన్నగున్నప్పుడు ఎర్రటి ఎండపూట బర్లని సెర్లగొట్టి ఈదిచ్చెటోళ్లు. బర్ల తోకలు పట్టుకొని సెరువంతా ఈదిన గుర్తులు అప్పడే మర్సిపోతాడు? ఊర్ల మెట్ట పంటలల్ల పుంటిత్తులు వేసినోల్లు పుంటిదంట్లు కోసి నాల్గురోజులు సెర్ల నానబెట్టి పుంటినార సీర్కపోయెటోళ్లని మతిల తల్సుకుంటుండు.

ఇమాముద్దీన్ మామ ఇజ్జత్ మనిషి. సొంతంగా పన్జేసుకోని బత్కతడు. ఆయన ఇంటినిండా పిల్లలే. ఎర్రలను తెచ్చి గాలానికి గుచ్చి పులుసు మందం సేపలు వట్కొని ఇంటిల్లాదులు తినేటోళ్లు. ఇప్పుడు సూత్తమన్న ఎవళ్లు సెర్లకు వొస్తలేంది సూసి కల లోనే తెగబాధ పడిపోతుండు.

సెరువులోని ఒండుమట్టి సెల్కలేస్తే భూములు కండగల భూములెక్క అవు తుండె. ఎండకాలం సెర్లపూడికనంత తీసి సెరువును అద్దంలేక్క జేస్తుండ్రి. సెరువంటే

రైతు భూములకు పులుపు నీరుతాపే అదెరువే కాదు సమస్త వృత్తులకు కల్పతరువని తలుస్తుండు.

తెల్గు నారాయ మామ కులపొల్లందరు కల్సి సెర్ల సేపగుడ్డును వొదిలింఁడ్రు. వొదిలెటప్పుడు కట్టమైశమ్మకు మొక్కింఁడ్రు. సేపగుడ్డు నీళ్లల్ల వొదిలినాక సన్న కొడుం శ్యాప పుట్లుపుట్లుగా పుట్టింది. సూస్తున్నంగనే సేప పిల్లలు తోకలెల్ల బెడ్తుండే. రయ్యి రయ్యిసేపలు సెరువంత తిరిగేటివి. జల్లలు, పర్కలు, బంగారుతీగెలు, కొఁర్రమీనులు, బచ్చెలు మూతిల మూతివెట్టి ముద్దాడుకుంటుండెనని నవ్వుకుంటుండు. పెద్దయ్య దూపగొనొచ్చిన పసుల మూతులకు కూడా ముద్దిస్తుండెనని అనుకుంటుండు. ఎండ తాపం భరించలేక నీళ్లల్ల పొర్లుతున్న జంగిడిబర్ల సంకల్ల జేరి, బర్ల సండ్లకు సకులు గుల్ల జేస్తుండె. సేపలు మొప్పలేసినవి. వోటోటి కంకెడు కంకెడైనవి. సెరువంతా వొకటే నీసువాసన. తెల్గువాళ్లు వలలేస్తుంఁడ్రి. కప్పలూ పడుతున్నవి. కుప్పలు కుప్పలుగా ఒడ్డుకేసిన సేపలు గిల్లగిల్ల కొట్టుకుంటె ఆ పొద్దు అన్ని కులాలోల్లకు పంచుతుంఁడ్రు. ఊరు ఊరే నీసువాసన వొస్తుండే.

## 6

ఒగరోజు మూలసుక్క వొడిసినప్పుడు సిక్కగా మొగులైంది. సూతమన్న సుక్కలవుపడ్తలేవు. కుండకు బొఁర్ర గుచినట్లు వొకటే తీరుగ వాన. అబ్బా! అది వానగాదు! సెప్పరాని వాన.

సెరువు కాలువలన్నీ తన్నుకొస్తున్నవి. కొత్తనీరు పలుపు సూసి సెర్లసేపలన్ని ఎదురెక్కుతున్నవి. ఊరుఊరంత సేపలవేటే. కమ్మగా పులుసు చేసుకొని ఊరంత సకులమూటం బెట్టుకొని సాపమీద కుసోని తింటుంది. అది సూసి కలలోనే మా పెద్దయ్య కన్నీరు పెడ్తుండె. సెరువంటే ఒక్కరి సంబురమే కాదు, ఊరుమ్మడి సంబురమని కన్నీటి బాష్పాలు రాల్చె.

రాఁత్రాను కల గాఢత తీవ్రమైతుంది. సెరువుకు పూల పండుగ బతుకమ్మ. ఆ బతుకమ్మ పండుగ సంబంధాలు ఏంటో, ఆపుకున్న కల ఆగుతలేదు. బతుకమ్మ పండుగ నాడు ఊరి అమ్మలక్కలు బాటెమ్మటి ఉండె తీరొక్క పూలు దెచ్చి బతుకమ్మ సేస్తుంఁడ్రి. పూలను పూజించే ఆ ఊరి సంప్రదాయానికి ముగ్దుడైండు. ఊర్ల ఏడొందల కడప ఉంటే ఏడొందల బతక్కమ్మలను చేసింఁడ్రు. ఇది నిద్రలోనే తలుసుకొని నవ్వుతుండు.

బత్కమ్మలన్నింటిని సావిడి కాడికి దెచ్చింఁడ్రు. ఆడనే కొంచెంసేపు పెట్టింఁడ్రు. ఇంగ ఏ కులపు స్త్రీలు ఆ కులపు స్త్రీలతో కలుపుకొని బొడ్డెమ్మలేస్తుంఁడ్రు. సావిడికాడ ఎన్ని బొడ్డెమ్మ గుంపులో! ఎన్ని సెరువు పాటలో... ఎన్ని అలల పాటలో... అన్నింటిని తలుసుకుంటుండు. నిద్రలోనే తన్మయత్వం పొందుతుండు.

బతుకమ్మ పాటల్లో నిత్యమల్లె చెట్టు, అన్న చెల్లెండ్ల అపురూప బంధాలు, గుమ్మడి పూల పాటలు, ఏ స్త్రీని కదిలిచ్చిన పూల పాటల సంపదనే. ఆ బతుకమ్మలను

తీసుకొని సందికంత గుండా సెర్లకు నడిసింద్రు. పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా అంటూ పాటలు పాడుతూ అన్నింటిని సెరువు అలలపై వొదిలింద్రు. మసక సీకట్లో సెరువు బతుకమ్మ దీపకాంతుల్లో ఎలిగిపోతుంటే మా పెద్దయ్య ఆనందానికి అంతు లేకుండ పోయింది. సెరువంటే సాంస్కృతిక వైభవమని, మునుపటి పల్లెల పండుగల్ని యాదిల గ్నాపకం చేసుకుంటుండు.

## 7

సెరువు నిండితే ప్రతి ఇంట్ల ఉన్న యిసురాళ్లు విచ్చుకునేటివి. పొయ్యొత్తు అంబటెసరును హత్తుకునేది. సిబ్బి జబ్బ సరిసేది. ఎద్దుల గిట్టల ఎగిసిపడుతుండేటివి. పొయిరాళ్లకు పొగరు మెలకెత్తేది. కలసాగుతూనే ఉంది. సెరువు నిండితే శాంపెకుండ వొల్లు సల్లగైతుండే. పన్రాయి లేస్తుండె. ఆరే రంపెలు పదునెక్కుతుండె. ఈత కత్తి మురిసిపోతుండేది. గౌడమోకు గట్టిపడుతుండె. తెల్గువల తెగ మురిసిపోతుండె. జంగిడి బర్ల ఆగడైతుండె. సాకలి పొయ్యిలు లేచి నిలుస్తుండె. సేపపిల్లలు జలమెరుపు లైతుండె. అలుగు ఎగిరి దుంకుతుండె. ముత్తడి ముత్తైదువ అవుతుండె. ఎవసాయం ఫలసాయమైతుండె. పక్షులు యక్షగానాలై లేస్తుండె. కొంగలు గోళ్లపై ముగ్గులేస్తుండె. ఒండు రైతుకు అండైతుండె. మొత్తంగా సెరువు పల్లె కన్నీరు తూడ్సుతుండేదని కలలు గంటుండు. సెరువు ఎండినాకనే కరువు పారిందని కలతజెందుతుండు.

కల కాస్తరూపం మారుతుండె. పచ్చని కల కాస్త కరువును కల గంటుండె. కలలోనే కరువు ఏకరువు వెడుతుండె. తల్లివోతే తరంబోయినట్లు, తండ్రివోతే బుడం పోయినట్లు సెరువు ఎండితే ఊరి బతుకే ఆగమయిందని కలలోనే గుండెలు బాదు కుంటుండు. అత్తలేని కోడలు ఉత్తమురాలన్నట్లు సెరువు లేని పాలన దరువుతప్పిన పాలనయని పాలకులను నిష్టురమాడుతుండు. పసలేని నాయకుడు పనిలేక ఉరికి నట్లు సెరువులు వొద్దు ప్రాజెక్టులు ముద్దని నదులు పారిచ్చి మీకాడినే పచ్చగుంటే అది ఏం నీతని పాలకులకు ప్రశ్నల కొడవలైండు. సెరువుల్ని సంపిన పాలన స్వర్ణ యుగమెట్లయిందని ఇంకుడు గుంతలపైనున్న ఇగురం, కుంటకట్టలను ఏసుడు కాడ లేదని మనసులనే గులుగుతుండు.యాల్లపాళ్ల లేనోడు భూపాల రాగం పాడినట్లు హైటెక్కు హైటెక్కని ఆకలి పేగుల రాగాల్ని ఇన్నది ఎన్నడులేదని కస్సుమంటుండు.

సెరువు నాశనంతోనే ఊరు కళవోయిందని దు:ఖిస్తుండు. ఎక్కడ సెరు వుండునో అక్కడ కరువుండదని, గిదికూడా పాలకులకు ఎరుకలేకపాయెని నిద్రలోనే ఎగిసి పడుతుండు. ఒకనాడు నిండ నీళ్లతో నిండిన సెరువు నేడు మురికి కంపలతో నిండిందని, ఇది ఊరికి దరిద్రమని గోస పడుతుండు. మురికి కంపలతో నిండిన సెరువుసూస్తే పెద్దయ్యకు గుండె అవిసిపోతుంది.

కోలెడంత లోతున్న సెరువు కొంగ కాళ్లంత అయింది. ఒండు, పాసు పేర్క పోయినట్లు పేర్కపోయింది. ఎప్పుడోపడ్డ సెరువు గండి ఇంకా పూడ్సలేదు. గండి

పెద్దపులిలా నోరు తెరిసింది. ఇదంత నెనరుదప్పిన పాలనని ఇసుక్కుంటుండు. సెరువు సెదిరినాకనే కరువు ముదిరిందని, బతుకు అదిరిందని గజగజ వొనుకు తుండడు. సెరువంటె పల్లె గుండెకాయని, సెరువు రూపాన్ని కండ్ల కద్దుకుంటుండు. సెరువు ఉన్నన్నాళ్లు బోర్లు బావులు ఊరుతుండె. ఆయింత సెరువు ఎండినాక బోర్లు పీకె.

ఇట్లా మనుసుల ఉత్కంట పడుతుండు. కలలో క్రమంగా రక్త ప్రసరణ పెరుగవట్టె. క్రమంగా కల ఉగ్రరూపం దాల్సుతుంది. ఉద్వేగపడుతుండు. ఊకె నిద్ర లోనే గట్టిగా అరుస్తుండు. " తూములు తెరువాలే, బతుకు పారాలే. అలుగు దుంకాలే కరువు దెంకపోవాలే..." అని వొనుక్కుంటు అరుస్తుండు. "సెరువుకట్టకు తట్టెడు మన్ను వేయాలే, పుట్టెడు దు:ఖాన్ని ఆపాలే... సెరువు సుట్టూ ఊరు సల్లగుండాలే... సెరువును బతకనియ్యండ్రా..." అని ఉద్వేగంగా అరుస్తుండు.

బి.పి పెరిగింది. నరాలు చిట్లినయి. కల చెదిరింది. తెల్లగా తెల్లారింది.

✤

పొద్దున్నె పెద్ది ఊపి ఊపి లేపింది. మనిషి పల్కుతలేడు. ముక్కుకాడ సెయ్యి వెట్టి సూచింది. గాలి ఆడ్తలేదు. మనిషి ఉల్కుతలేడు, పలుకతలేడు.

మనిషంతా సల్లగయిండు. సెరువు వాసన కొడ్తుండు... సెరువు మట్టివాసన కొడ్తుండు...

*నమస్తే తెలంగాణ 'బతుకమ్మ'*
*5 ఏప్రిల్ 2015*

✻



15 ఏప్రిల్ 1981న జన్మించిన గుడిపల్లి నిరంజన్ ఇప్పటివరకూ ఆరు కథలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

*చిరునామా: గుడిపల్లి గ్రామం, నాగర్‌కర్నూల్ మండలం, మహబూబ్ నగర్ జిల్లా -509235 ఫోన్: 94933 19878*
**niranjangudipally@gmail.com**